
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





సల్లంగా సూడమ్మా..



మేడ్చల్ మండలంలోని రావల్‌కోల్ గ్రామంలో ఆదివారం పోచమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు, డప్పు చప్పుళ్ల నడుమ మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఫలహారం బండ్ల ఊరేగింపు నిర్వహించారు. పంటలు బాగా పండాలని, పిల్లాపాపలను సల్లంగా చూడాలని మొక్కుకున్నారు.

- మేడ్చల్ టౌన్, ఆగస్టు 11

ముగిసిన బ్రహ్మోత్సవాలు

వారం రోజులుగా వైభవంగా నిర్వహించిన ఎదులాబాద్ గోదాసమేత శ్రీమన్నారు రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఆదివారం అమ్మవారికి నిర్వహించిన అభిషేకంతో ఉత్సవాలు ముగిశాయి, కాగా ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, ఘటాభిషేకం, మహదాశీర్వచన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయధర్మకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు11

బీజేపీ ఆధ్వర్యంలో మున్సిపల్ దర్బార్



డ్రైనేజీని పరిశీలిస్తున్న నాయకులు

వికారాబాద్, ఆగస్టు 11 : గత 25ఏళ్లుగా అనంతగిరిపల్లెలో సీసీ రోడ్లు వేయకపోవడం, డ్రైనేజీ సమస్యలు, స్కూల్ బిల్డింగ్ లీకేజీలు, తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవ రెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు నరోత్తంరెడ్డి 10వ వార్డు ఇన్‌చార్జి పాండునాయక్ ఆధ్వర్యంలో పట్టణంలోని అనంతగిరిపల్లి, చెంచుపల్లి, లక్ష్మీనగర్ తండాలో మున్సిపల్ దర్బార్ కార్యక్రమం నిర్వహించి పోస్టర్ విడుదల చేశారు. మాధవరెడ్డి మాట్లాడుతూ లక్ష్మీనగర్ తండాలో తాగునీటి కోసం వేసిన బోరు స్టార్టర్ కాలిపోయి ఆరు నెలలు అవుతోందన్నారు. ఈ సమస్యలతో పాటు ఇతర సమస్యలను కూడా బీజేపీ నాయకులు గుర్తించి వాటికి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కే.శివరాజ్, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, పట్టణ ఇన్‌చార్జి రాజేందర్ రెడ్డి, డాక్టర్ కొప్పుల రాజశేఖర్, మహిళా మోర్చా అధ్యక్షురాలు శిరీష, పట్టణ ప్రధాన కార్యదర్శి ఉప్పు అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.


భూ సమస్యలే ఎజెండాగా సదస్సు

- రేపు కొడంగల్‌లో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహణ
- భవిష్యత్తు పోరాటాలకు ప్రణాళిక : సంఘం నేతల వెల్లడి



సదస్సు కరపత్రాన్ని విడుదల చేస్తున్న కార్మిక సంఘం నాయకులు

తాండూరు, ఆగస్టు 11: భూ సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 13న కొడంగల్ వేదికగా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి భూ సదస్సును నిర్వహిస్తున్నట్లు వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప , సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం తాండూరులో భూ సదస్సు కరపత్రాన్ని విడుదల చేసిన అనంతరం మాట్లాడారు. ఈ సదస్సును కొడంగల్‌లో బసిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించడం జరుగుతుందని విజయవంతం చేయాలని వారు కోరారు. అభివృద్ధి పేరుతో జిల్లాలోని రైతులు, పేదల భూములు లాక్కోవడాన్ని వెంటనే ఆపాలని వారు కోరారు. కొడంగల్ నియోజకవర్గంలో 1154 ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూమి అన్యాక్రాంతమైయిందని, అట్టి భూముల జోలికి పోకుండా అధికార యంత్రాంగం వెళ్లొద్దన్నారు. సన్న, చిన్నకారు నిరుపేద రైతుల జోలికి వెళ్లి అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని, పేదల భూసమస్యలు పరిష్కరమే ఎజెండాగా భవిష్యత్తు ప్రణాళిక రూపొందించడానికి, పోరాట ప్రణాళికను ఖరారు చేసేందుకు ఈ సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం చంద్రయ్య, నర్సింహులు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. విద్యాశాఖ ఉన్నతాధికారులు పంపించిన ఫార్మాట్‌లో పాఠశాలల వారీగా వివరాలు తెప్పించుకుంటున్నారు. అయితే పాఠశాలల వారీగా కరెంట్ మీటర్ నంబర్, ఇంత వరకు ఉన్న బకాయిలు, రెండు నెలలుగా బిల్లుల సమాచారాన్ని విద్యాశాఖ అధికారులు సేకరిస్తున్నారు. సీఎం హామీ మేరకు ఉచితంగా విద్యుత్ సరఫరా జరిగితే ప్రతినెలా ఒక్కో పాఠశాలకు రూ.500 నుంచి రూ. 2వేల వరకు బిల్లుల భారం తప్పనుంది.

స్కూళ్లకు ఉచిత విద్యుత్!

- తప్పనున్న కరెంట్ బిల్లుల భారం
- జిల్లా వ్యాప్తంగా 1,063 పాఠశాలలు

వివరాలు సేకరిస్తున్న విద్యాశాఖ అధికారులు



వికారాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్కూళ్లకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తామంటూ ఇటీవల ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. మన ఊరు- మన బడి, పీఎం శ్రీ, అమ్మ ఆదర్శ కమిటీల ఏర్పాటుతో స్కూళ్లలో సౌకర్యాలు గతంలో కంటే మెరుగయ్యాయి. ప్రతీ క్లాస్ రూమ్‌లో లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేయడంతో కరెంట్ బిల్లు ఎక్కువగానే వస్తోంది. డిజిటల్ తరగతులు ప్రారంభించడంతో విద్యుత్ సదుపాయం, ఇంటర్నెట్ సౌకర్యం తప్పనిసరిగా మారిన విషయం తెలిసిందే. అలాగే నీటి అవసరాలు తీర్చుకునేందుకు పలు పాఠశాలల్లో బోరు మోటార్లు కూడా ఏర్పాటు చేశారు. కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛమైన తాగునీటి కోసం స్వచ్ఛంద సంస్థల సహకారంతో వాటర్ ప్యూరిఫైయర్లు బిగించారు. దీంతో గతంలో కంటే విద్యుత్ వినియోగం పెరిగిపోవడంతో ప్రతీ నెలా రూ.500 నుంచి 2 వేల వరకు బిల్లులు చెల్లించాల్సి వస్తోంది. పాఠశాలల నిర్వహణకు ప్రభుత్వం ఏటా నిధులు మంజూరు చేస్తున్నా పాఠశాలల సాధారణ అవసరాలకే సరిపోని పరిస్థితి. సీఎం హామీ మేరకు ఉచితంగా విద్యుత్ సరఫరా జరిగితే ప్రతినెలా ఒక్కో పాఠశాలకు బిల్లుల భారం తప్పనుంది.

రెండు విడతలుగా నిధులు

విద్యాశాఖ ఉన్నతాధికారులు పంపించిన ఫార్మాట్‌లో పాఠశాలల వారీగా వివరాలు తెప్పించుకుంటున్నారు. పాఠశాలలకు ప్రభుత్వం మంజూరు చేసే నిర్వహణ నిధులు రెండు విడతల్లో విడుదల చేయడం వల్ల బిల్లుల చెల్లింపుల్లో ఇబ్బందులు ఎదుర్కొంటూ వచ్చారు. తొలి విడతలో జూలై, ఆగస్టు నెలల్లో నిధులు విడుదల చేస్తుండగా, రెండో విడత నిధులు మాత్రం మార్చి నెలల్లో విడుదల చేస్తున్నారు. నెలల తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో వడ్డీ పెరిగి బిల్లులు తడిసి మోపడవుతూ వచ్చాయి. కాగా, ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే బిల్లులను ప్రభుత్వమే భరించి ఉచితంగా కరెంట్ సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోనుంది.



నిర్వహణ నిధుల్లో సగం బిల్లులకే

పాఠశాలల నిర్వహణకు మంజూరు చేసే నిధుల్లో నుంచే విద్యుత్ బిల్లులు చెల్లింపులు చేస్తున్నారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా స్కూళ్లకు గ్రాంట్ కేటాయిస్తారు. 30 మంది లోపు విద్యార్థులు ఉంటే రూ.10 వేలు, 31 నుంచి 100 మంది విద్యార్థులు ఉంటే రూ.25 వేలు, 101 నుంచి 250 మంది లోపు ఉంటే రూ.50 వేలు, 251 నుంచి 1000 మందిలోపు ఉంటే రూ.75 వేలు, అంత కంటే ఎక్కువ మంది విద్యార్థులు ఉంటే రూ.లక్ష చొప్పున మంజూరు చేస్తారు. ఈ నిర్వహన నిధుల్లో సగం వరకు విద్యుత్ బిల్లుల చెల్లింపులకే సరిపోతుండగా, మిగతా నిధులను మరుగుదొడ్ల, మూత్రశాలల శుభ్రతకు, తాగునీటి సరఫరా, నిర్వహణ, మరమ్మతులు, రిజిస్టర్లు, స్టేషనరీ, ప్రయోగ సామగ్రి, చాక్‌పీస్‌ల కొనుగోళ్లు, జాతీయ పండుగల నిర్వహణ తదితర కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు.

పాఠశాలల వారీగా వివరాల సేకరణ...

జిల్లాలో 776 ప్రాథమిక పాఠశాలలు, 111 ప్రాథమికోన్నత, 176 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలలకు నెలనెలా రూ.200 నుంచి రూ.300 వరకు కరెంట్ బిల్లు వస్తుండగా, ప్రాథమిక పాఠశాలలకు రూ.500 వరకు, ఉన్నత పాఠశాలలకు రూ.1,000 నుంచి రూ.2 వేల వరకు బిల్లులు వస్తున్నాయి. తరగతి గదులు, ప్రయోగశాలలు, కంప్యూటర్ల వినియోగం అధికంగా ఉండే పాఠశాలలకు మరింత ఎక్కువగా బిల్లు వస్తోంది. అయితే పాఠశాలల వారీగా కరెంట్ మీటర్ నంబర్, ఇంత వరకు ఉన్న బకాయిలు, జూలై, ఆగస్టు నెలల బిల్లుల సమాచారం విద్యాశాఖ అధికారులు సేకరిస్తున్నారు.



ఆటల కిట్ల జాడేదీ?

- నిరుపయోగంగా తెలంగాణ క్రీడా ప్రాంగణాలు
- అందుబాటులో లేని క్రీడా సామగ్రి

మేడ్చల్ ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో యువకులు, పిల్లలు ఆటలు ఆడుకునేందుకు ప్రభుత్వం గతేడాది అన్ని పంచాయతీల్లో ఎకరం విస్తీర్ణంలో తెలంగాణ క్రీడా ప్రాంగణాలను ప్రారంభించింది. ఒక్కో ప్రాంగణానికి రూ. లక్షల చొప్పున ఉపాధిహామీ నిధులను వెచ్చించింది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 25 వేల ప్రాంగణాలను ఏర్పాటు చేయగా వీటిలో 16 వేల ప్రాంగణాలకు క్రీడా సామగ్రిని అందజేసింది. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో యువకులు, పిల్లలు తమకు నచ్చిన ఆటలు ఆడుకునే వెసులుబాటు కల్పించింది. ప్రస్తుతం తెలంగాణ క్రీడా ప్రాంగణాలు వెలవెలబోతున్నాయి. గతేడాది క్రీడా సామగ్రిని పంపిణీ చేసింది. కొన్నాళ్లు వాటిని ఆయా మున్సిపాలిటీలు, ఎంపీడీవో కార్యాలయాల్లో ఉంచారు. తర్వాత సామగ్రిని పంపిణీ చేసినా క్షేత్రస్థాయిలో వీటి జాడే లేకుండా పోయింది. ఇవి ఎవరి వద్ద ఉన్నాయో అధికారులకు కూడా తెలియయని పరిస్థితి నెలకొంది. మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలోని వ్యాప్తంగా నిర్మించిన తెలంగాణ క్రీడా ప్రాంగణాలకు(టీకేసీ) అప్పటి ప్రభుత్వం ఆటల కిట్లను మంజూరు చేసింది. క్రీడా పరికరాలతో పాటు ఆటగాళ్లకు టీ షర్టులను కూడా అందజేసింది. జిల్లాలో నిరుపయోగంగా ఉన్న క్రీడా ప్రాంగణాలు క్రీడాకారులతో కళకళలాడుతాయని అంతా భావించారు. కానీ క్షేత్రస్థాయిలో ఇందుకు విరుద్ధంగా ఉంది.



వినియోగంలోకి వచ్చేనా..

పలు క్రీడా ప్రాంగణాల్లో ఆట వస్తువులు లేకపోవడంతో విద్యార్థులు, యువకులు వెళ్లి ఆడుకునేందుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. వీటిని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెచ్చేందుకు క్రికెట్ తదితర క్రీడలకు సంబంధించిన కిట్లను ప్రజాప్రతినిధుల సమక్షంలో అందించారు. ప్రస్తుతం క్రీడా పరికరాల జాడ లేకపోవడంతో క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి.

జిల్లాలో 81 క్రీడా ప్రాంగణాలు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని గ్రామాల్లో 59, మున్సిపాల్టీల్లో 22, మొత్తం 81 క్రీడా ప్రాంగణాలున్నాయి. ప్రభుత్వం పంపిణీ చేసిన ఆటల కిట్లను స్థానికంగా టీకేపీ(తెలంగాణ క్రీడా ప్రాంగణం) ఉన్న చోట అనుబంధ గ్రామాల యువకులకు పంపిణీ చేశారు. వీటిని పంపిణీ చేసి 10నెలలు గడుస్తున్నా వీటిని ఎక్కడా ఉపయోగించింది లేదు. క్షేత్రస్థాయిలో ఆటల కిట్లు కనిపించకపోవడంపై అధికారులు దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది. వాస్తవానికి ఆటల కిట్లు ఉన్నాయా లేవా.. ఉంటే వాటిని క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాల్సి అవసరం ఎంతైనా ఉంది. .

చీకట్లు.. ఇక్కట్లు

- పడకేసిన వీధిదీపాల నిర్వహణ
- పత్తాలేని ఈఈఎస్ఎల్ ఏజెన్సీ
- ప్రజల గోడుపట్టించుకోని మున్సిపాలిటీ అధికారులు, పాలకులు



జిల్లా ఆస్పత్రి మార్గంలో లైట్లు వెలగక కమ్ముకున్న చీకటి

తాండూరు, ఆగస్టు 11 : ఏ కాలనీలో చూసినా.. ఏ గల్లీలో చూసినా చీకటి మయం.. మా గల్లిలో లైట్లు వెలగడం లేదని మొరపెట్టుకుంటున్న జనం.. సార్ మా గల్లీలో చాలా బల్బులు పోయాయి.. జనం మా ఇంటికొచ్చి గోల పెడుతున్నారని, లైట్లు వేయించండి అంటూ కౌన్సిలర్ల ఆవేదన... ఎవరు చెప్పినా అధికారుల్లో మాత్రం చలనం లేదు. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇది తాండూరు మున్సిపాలిటీలోని వీధిదీపాల నిర్వహణ పరిస్థితి. మున్సిపాలిటీలో వీధి లైట్ల నిర్వహణ అధ్వానంగా మారింది. గల్లీలోనే కాదు ప్రధాన రహదారుల్లోను వెలగడం లేదు. సమాచారం ఇచ్చినా, చిన్న సమస్య అయిన రోజులు తరబడి కాలయాపన చేస్తున్నారు. తాండూరు పట్టణంలోని కోర్టు, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, సాయిపూర్ నెంబర్ వన్ ఉన్నత పాఠశాల, ప్లైఓవర్, కోకట్‌రోడ్డు, పాత తాండూరు, హమాలీ బస్తీ, గుండు ఫీర్లు, సీతారాంపేట్, అయ్యప్పనగర్, రాఘవేంద్ర కాలనీ, ఇలా చెప్పుకుంటూ పోతే జాబితా తయారవుతుంది. పలు ప్రాంతాలలోని రోడ్లు, గల్లీల్లో వీధి దీపాలు వెలుగడం లేదని రోజుకు 20 నుండి 50వరకు వీధి దీపాలపై ఫిర్యాదులు అందుతున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లైట్లు వెలగడం లేదని స్థానికులు ఇంటికొచ్చి మొరపెట్టుకుంటున్నారని కౌన్సిలర్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. చేసేదేమీ లేక సిబ్బందినే బతిమిలాడుకొని పని చేయించుకునే పరిస్థితి ఏర్పడిందని ఓ కౌన్సిలర్ ఆవేదన వ్యక్తం చేశారు.



ప్లైఓవర్‌పై వెలుగని వీధి దీపాలు

నిధులున్నా..

జిల్లాలోనే అత్యధిక ఆదాయం ఉన్న మున్సిపాలిటీ తాండూరు. నిధులకు కొరత లేదు. పన్ను రూపంలో ప్రజలు మున్సిపాలిటీ ఆదాయాన్ని సమకురుస్తున్నారు. కనీసం కాలనీల్లో, గల్లీల్లో అవసరమైన వీధి దీపాల మరమ్మతుల పట్ల ఆశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. సిబ్బంది ఉన్నా పర్యవేక్షణ కొరవడింది. వీధి దీపాలకు, సిబ్బంది జీతాలకు మాత్రం లక్షల్లో ఖర్చుఅవుతున్నాయి. లైట్లు మాత్రం వెలగడం లేదు.

పుడమి పులకింత



బషీరాబాద్ మండల పరిధిలో రైతులు వానాకాలం సీజన్ ప్రారంభంలో పత్తి విత్తనాలు విత్తారు. ఇటీవల కురిసిన వర్షాలతో ఆ పత్తి చేన్లకు జీవం పోసినట్లయింది. దీంతో పత్తి మొక్కలు ఏపుగా పెరిగి మురిపిస్తున్నాయి. రైతులు కలుపుతీత, మందులను పిచికారీ చేస్తూ బిజీబిజీగా కనిపిస్తున్నారు. గతేడాది కంటే ఈసారి పత్తి విస్తీర్ణం పెరగడం, పంట ఆశాజనకంగా ఉండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

బషీరాబాద్, ఆగస్టు 11

సండే.. సందడి!

తాండూరు, ఆగస్టు 11 : సెలవురోజు కావడంతో తాండూరు పట్ట ణం సమీపం చెన్‌గేశ్‌పూర్ రోడ్డులోని జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల ఆవరణంతా సందడిగా మారింది. ప్రతి నెలా రెండో ఆదివారం తమ పిల్లలను చూసుకునేందుకు తల్లిదండ్రులు వస్తుండడంతో సందడిగా మారింది. పాఠశాల ఆవరణలో చెట్లకింద కూర్చొని విద్యార్థునుల బాగోగులను తల్లిదండ్రులు అడిగి తెలుసుకున్నారు. పిల్లలతో కలిసి భోజనాలు చేశారు. తిరిగి సాయంత్రం ఇళ్లకు వెళ్లిపోయారు.



గురుకులం ఆవరణలో తల్లిదండ్రులతో కూర్చున్న విద్యార్థినులు

పేద విద్యార్థులకు చేయూత



నాటి ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

తాండూరు, ఆగస్టు 11: తాండూరు విజయ విద్యాలయ హైస్కూల్‌లో 1985-1986 సంవత్సరం విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు అదే పాఠశాలలో చదివే బీద విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్, దుస్తులు పంపిణీ చేసి ఉదారత చాటుకున్నారు. ఆదివారం వీవీహెచ్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. పూర్వ విద్యార్థులు తలో చెయ్యి వేసి తాము చదివిన పాఠశాలలోని బీద విద్యార్థులు 50మందికి స్కూల్ యూనిఫామ్, దుస్తులు, నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. అలాగే విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు సిద్ధన్న, నారాయణ, లలితలను సన్మానించారు. 39ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయంగా పలకరించుకున్నారు.

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కులకచర్ల, ఆగస్టు 11: ఆర్టీసీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీఎస్.ఆంజనేయులు అన్నారు. పరిగి డిపో ఆధ్వర్యంలో ఆదివారం ముజాహిద్‌పూర్ గ్రామంలో కార్గో సర్వీస్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఆర్టీసీ అధికారులు అందిస్తున్న కార్గో సర్వీస్ సేవలు గ్రామానికి వచ్చాయని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ చంద్రభూపాల్‌రావు, అనంతయ్య, శ్యామ్‌రావు, అరవింద్, చంద్రయ్య, వెంకటయ్య, పులింగ వెంకటేశ్, షర్ఫొద్దీన్, కార్గోసెంటర్ ఇన్‌చార్జి విశ్వనాథ్, వసంత్, రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కార్గో సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఆంజనేయులు

హైవేపైనే పార్కింగ్!

● ప్రతిపాదనలకే పరిమితమైన పార్కింగ్ హబ్

● వాహనాలు నిలిపే స్థలం లేక ఇక్కట్లు



44వ నంబర్ జాతీయ రహదారి పక్కన పార్క్ చేసిన ట్రక్కులు

మేడ్చల్ టౌన్, ఆగస్టు 11 : రోజూ హైదరాబాద్‌కు సరుకులు తరలించే వాహనాలకు పార్కింగ్ స్థలం లేక ట్రక్కులు, ఇతర గూడ్స్ వాహనాల డ్రైవర్లు ఇబ్బంది పడుతున్నారు. నగరంలోకి నోఎంట్రీ టైమ్‌లో రోడ్డు పక్కన వాహనాలను పార్కింగ్‌కు తలపెట్టిన పార్కింగ్ హబ్ ప్రతిపాదనలకే పరిమిమైంది. దీంతో జాతీయ రహదారి పరిసరాలే పార్కింగ్ స్థలంగా మారింది. ఇది వచ్చీపోయే వాహనాలకు ప్రమాదకరం అని తెలిసినా నో ఎంట్రీ సమయాల్లో హైవే పక్కనే వాహనాలు నిలుపుతున్నారు. మేడ్చల్ వైపు నుంచి నగరానికి వెళ్లే రూట్లో ఓఆర్ఆర్ వరకు గల జాతీయ రహదారి పక్కన వందలాది లారీలను నిలుపుతున్నారు. నాగ్‌పూర్-బెంగళూరు 44వ జాతీయ రహదారిపై నుంచి రోజూ వేలాది సరుకు రవాణా వాహనాలు వెళ్తుంటాయి. ఉత్తర భారత రాష్ట్రాల నుంచి దక్షిణాది రాష్ట్రాలకు సరుకు రవాణాకు 44వ నంబర్ జాతీయ రహదారి ప్రధానమైంది. పీక్ సమయాల్లో భారీ వాహనాలకు హైదరాబాద్‌లోకి నో ఎంట్రీ ఆటంగా మారింది. సరుకు రవాణా వాహనాలు ప్రవేశ సమయం కోసం వేచిచూస్తూ రింగ్ రోడ్డు పక్కన నిలుపుతున్నారు. ప్రస్తుతం భారీ వాహనాలకు రాత్రి 9గంటల నుంచి ఉదయం 8:30గంటల వరకు అనుమతిస్తున్నారు. నగర పరిసర ప్రాంతాలకు వెళ్లే లారీలకు ఉదయం 11:30నుంచి సాయంత్రం 4గంటల వరకు అనుమతిస్తున్నారు. మిగితా సమయాల్లో భారీ వాహనాలను అనుతించరు. దీంతో నగరంలోకి చేరుకోవాల్సిన ట్రక్కులు అనుమతి సమయం వరకూ మేడ్చల్ జాతీయ రహదారి పరసరాల్లో నిరీక్షిస్తున్నాయి. రోడ్డు పక్కన పార్కింగ్ నేరం అన్న విషయం తెలిసినా గత్యంతరం లేక లారీలు, మినీ ట్రక్కులను రోడ్డు పక్కన నిలుపుతున్నారు. ట్రాఫిక్ పోలీసులకు జరిమానాలు చెల్లిస్తున్నారు.

పార్కింగ్ హబ్ ఏర్పాటు ఉట్టిదేనా?

44వ నంబరు జాతీయ రహదారిపై నగరానికి చేరుకోవాల్సిన సరుకు రవాణా వాహనాలను నో ఎంట్రీ సమయాల్లో నిలుపుకునేందుకు ప్రభుత్వం స్థలాన్ని కేటాయించాలనే ప్రతిపాదన కాగితాలకే పరిమితమమైంది. రోడ్డు పక్కన వాహనాల నిలుపుదలతో ఇతర వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీని నివారణకు పోలీసులు గతంలో రింగ్‌రోడ్డు సమీపంలోని ప్రభుత్వ స్థలంలో పార్కింగ్ హబ్ ఏర్పాటు చేసి వేచి ఉండే డ్రైవర్లకు సదుపాయాలు కల్పించాలని ప్రతిపాదించారు. అయితే రింగ్ రోడ్డు సరిసరాల్లో ప్రభుత్వం స్థలం లేక ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు.

దోచుకుంటున్న ప్రైవేట్ పార్కింగ్ నిర్వాహకులు

నగరంలోకి భారీ వాహనాల నో ఎంట్రీ సమయంతో వాహనదారుల అవసరాలను ఆసరాగా చేసుకుని కొందరు రింగ్‌రోడ్డు పరిసర ప్రాంతాల్లో పెయిడ్ పార్కింగ్‌ను ఏర్పాటు చేసుకుని లారీ డ్రైవర్ల నుంచి భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారు. 24గంటల పార్కింగ్‌కు రూ.300-500 వసూలు చేస్తున్నారు. దీంతో వాహనదారులు డబ్బులు చెల్లించలేక రోడ్డు సరిసరాల్లో, రింగ్ రోడ్డు పక్కనున్న సర్వీసు రోడ్డుపై లారీలను నిలుపుకుంటున్నారు. నగరానికి సరుకుల లోడ్‌తో వచ్చిన వాహనాలు అన్‌లోడ్ చేసి తిరిగి తమ సొంత ప్రాంతాలకు వెళ్లే సమయంలో లోడ్ లభించే వరకు వేచి ఉంటారు. వారు పెయిడ్ పార్కి ంగ్‌లో డబ్బులు చెల్లించలేక రోజుల తరబడి రోడ్డు పక్కనే లారీలను నిలిపుకుంటున్నారు.

రోడ్డు పనులతో మరిన్ని ఇబ్బందులు

ప్రస్తుతం మేడ్చల్‌లో హైవేపై వంతెన పనులు కొనసాగుతున్నాయి. రోడ్డు పరిసరాల్లో విచ్చలవిడిగా నిలుపుతున్న వాహనాలతో ట్రాఫిక్ జామైతోంది. దీనికి తోడు మేడ్చల్ చెక్‌పోస్టు ప్రాంతంలో పలు ట్రాన్స్‌పోర్టు కంపెనీల ట్రక్కులను రోడ్డు పక్కనే రోజుల తరబడి పార్క్ చేస్తున్నారు. మేడ్చల్ నుంచి రింగు రోడ్డు వరకు పలు ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలు, ఆస్పత్రులున్నాయి. విద్యార్థుల రాకపోకలు, సాధారణ ప్రయాణికులతో హైవే రద్దీగా ఉంటుంది. లారీల పార్కింగ్‌తో ట్రాఫిక్ సమస్య రెట్టింపవుతోంది. సరుకు రవాణా వాహనాలకు జాతీయ రహదారి సమీపంలో పార్కింగ్ హబ్‌ను ఏర్పాటు చేయాలని స్థానిక వాహనదారులు, ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

దుకాణాల వద్ద వాహనాల నిలిపివేతతో ఇబ్బందులు

ఆమనగల్లు: ఆమనగల్లులో రహదారుల పక్కనే పార్కింగ్‌కు అడ్డాగా చేసుకోవడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్ల మధ్యలో వాహనాల పార్కింగ్‌తో వాహనదారులు, ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. దుకాణాల వద్ద ఎక్కడ పడితే అక్కడ గంటల తరబడి ద్విచక్ర వాహనాలు, కార్ల పార్కింగ్‌లతో కొన్ని చోట్ల ప్రయాణికులకు నడిచేందుకు కూడా ఇబ్బందులు తప్పడం లేదు. ఇలా అక్రమ పార్కింగ్‌లతో తరచూ చిన్నచిన్న ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ముందే ఆక్రమణలతో రోడ్లు కుంచించుకుపోగా దానికి తోడు ద్విచక్ర వాహనాల పార్కింగ్‌తో వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై రాజీవ్ చౌక్ నుంచి సాయిరాం మెడికల్ హాల్ వరకు, ఆమనగల్లు-మాడ్గుల రోడ్డులో గాంధీచౌక్ వరకు, షాద్‌నగర్ రోడ్డులో సురసముద్రం చెరువు కట్ట వరకు రోడ్ల పక్కనే పార్కింగ్‌లతో ఇబ్బందులు తప్పడం లేదు. ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ కూడా అవుతోంది. దుకాణాల వద్ద ఇప్పటికే చిరు వ్యాపారాలు సాగిస్తున్నారు. దుకాణాలు, చిరు వ్యాపారుల వద్దకు వచ్చే కొనుగోలు దారులు రోడ్డు మధ్యలోనే వాహనాలు నిలుపుతున్నారు. కొందరు వాహనాలను గంటల తరబడి రోడ్డుపై నిలుపుతుండడంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. బస్టాండ్ వద్ద కల్వకుర్తి వైపు రోడ్డు ఆక్రమణలు, వాహనాల పార్కింగ్‌తో బస్సులు సైతం తిరగలేని పరిస్థితి ఏర్పడిందని ప్రయాణికులు వాపోతున్నారు. బస్టాండ్‌లో పార్కింగ్ స్థలం ఉన్నా డబ్బులు చెల్లించాల్సి వస్తుందని ద్విచక్ర వాహనదారులు రోడ్లపైనే పార్క్ చేస్తున్నారు. ఇలాంటి వారిపై ట్రాఫిక్ పోలీసులు, మున్సిపాలిటీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు అప్పుడప్పుడు రహదారిపై హడావుడి చేస్తున్నారు తప్పితే ట్రాఫిక్ నియంత్రణకు, వాహనాల అక్రమ పార్కింగ్‌లపై చర్యలు తీసుకోవడం లేదని పట్టణ ప్రజలు అంటున్నారు. ట్రాఫిక్ పోలీసులు సైరన్ వేసుకొని కారులో వెళ్లడమే తప్ప కారు దిగి వాహనదారులకు చెప్పడం లేదంటున్నారు. రోడ్లపై పార్కింగ్ నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఆమన్‌గల్‌లో జాతీయ రహదారి పక్కన నిలిపి ఉన్న బైక్‌లు

బీజేవైఎం జాతీయ ప్రధాన కార్యదర్శిని కలిసిన బీజేపీ నాయకులు



విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

చేవెళ్ల, ఆగస్టు 11: బీజేవైఎం జాతీయ ప్రధాన కార్యదర్శి రోహిత్ చౌహాన్‌ను చేవెళ్ల మండల బీజేపీ నాయకులు మార్యపూర్వకంగా కలిశారు. ఆదివారం రాష్ట్ర పర్యటనకు వచ్చిన రోహిత్‌ను శంషాబాద్ విమానాశ్రయంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు కలిసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు చేవెళ్ల మహేందర్, సురేంద్రశర్మ, మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, నాయకులు మాల్గరి వైభవ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి, మశ్చేందర్‌రెడ్డి, కృష్ణ, దామోదర్ ఉన్నారు.

మేడ్చల్ బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడిగా భాస్కర్‌యాదవ్



శంభీపూర్ రాజు నుంచి నియామక పత్రం అందుకుంటున్న భాస్కర్ యాదవ్

మేడ్చల్ టౌన్, ఆగస్టు 11: మేడ్చల్ పట్టణ బీఆర్ఎస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా భాస్కర్‌యాదవ్‌ను నియమించారు. ఈ మేరకు మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆదివారం భాస్కర్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. తనపై ఎంతో నమ్మకంతో పార్టీ ఇచ్చిన పదవికి పూర్తి న్యాయం చేసి పార్టీ బలోపేతానికి పాటుపడతానని భాస్కర్‌యాదవ్ అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ప్రాంగణంలోకి ... వరద నీరు

● విద్యార్థులు, ఉపాధ్యాయుల ఇక్కట్లు



పాఠశాల గేటు వద్ద ఏర్పడిన నీటి మడుగు

కొందుర్గు, ఆగస్టు 11 : రెండు గ్రామాల నుంచి వచ్చే వర్షపు నీటితో పాఠశాల ప్రాంగణం నీటి కుంటలా మారుతుండడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీరంగాపూర్ పంచాయతీ పరిధి సోమారంపాడ్, అలాగే మహదేవ్‌పూర్ పంచాయతీ పరిధి అయ్యవారిపల్లి ఈ రెండు పంచాయతీలకు హామ్లెట్ గ్రామాలు. రెండు గ్రామాలకు కలిపి అయ్యవారిపల్లిలో ప్రాథమిక పాఠశాల ఉంది. వర్షాకాలంలో ఈ రెండు గ్రామాల్లో కురిసిన వర్షపు నీరు నేరుగా ప్రాంగణంలోకే వస్తోంది. స్కూలు గేటు వద్ద పెద్ద మడుగులా తయారైంది. నీటి గుంత నుంచి వెళ్లలేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి, వర్షపు నీరు పాఠశాలలోకి వెళ్లకుండా కట్ట కట్టించడమో లేక ఎత్తుగా సీసీ రోడ్డు వేయడమో చేయాలని విద్యార్థుల తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.



బురదమయంగా పాఠశాల ఆవరణ

సైడ్‌వాల్ కూలి ప్రమాదకరంగా రోడ్డు

కొందుర్గు, ఆగస్టు 11 : కల్వర్టు రక్షణ గోడ కూలిపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనాదారులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని శ్రీరంగాపూర్ శివారులో షాద్‌నగర్-పరిగి వెళ్లే రోడ్డులో కల్వర్టు ఉంది. గత సంవత్సరం కురిసిన వర్షాలకు కల్వర్టు గోడ కూలిపోయింది. రోడ్డు ఎత్తుగా ఉండి వాహనాలు పడిపోయే ప్రమాదం ఉండడంతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్అండ్‌బీ అధికారులు సైడ్‌వాల్‌ను కట్టించారు. అయితే కొన్నాళ్లకే కల్వర్టు గోడ మళ్లీ కూలింది. ఈ రోడ్డుపై కొత్తగా వచ్చే వాహనదారులకు ఇక్కడ రోడ్డు ప్రమాదకరంగా ఉన్న విషయం తెలియాలంటే కల్వర్టుకు సైడ్ వాల్ కట్టాల్సిందే. షాద్‌నగర్-పరిగి ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రహదారి కల్వర్టు గోడను మరోసారి నాణ్యతతో నిర్మాణం చేయించాలని అధికారులను వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.



కల్వర్టు వద్ద కూలిపోయిన రక్షణ గోడ

ఘనంగా తీజ్ వేడుక



తీజ్ సంబరాల్లో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, వజ్రేష్‌యాదవ్, స్థానికులు

ఘట్‌కేసర్, ఆగస్టు11: కుల మతాలకతీతంగా అందరి పండుగలను అందరూ కలిసిమెలిసి జరుపుకోవాలని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. ఆదివారం ఘట్‌కేసర్ పరిధి ఎన్ఎఫ్‌సీ నగర్‌లోని బ్యూటీనెస్ట్ లే అవుట్‌లోని పార్కు స్థలంలో గోర్ బంజారా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తీజ్ సంబరాల్లో వారు పాల్గొన్నారు. బంజారాలు భక్తి శ్రద్ధలతో తీజ్ పండుగను జరుపుకుంటారని అన్నారు. బ్యూటీనెస్ట్ వెంచర్‌లోని పార్కు స్థలాన్ని కేటాయించాలని వారు కోరిన విషయమై ప్రజాప్రతినిధుల, నాయకుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అతిథులను బంజారాలు సన్మానించారు. తమ సంప్రాదాయం ప్రకారం ప్రత్యేక బుట్టల్లో గోదుమలను వేసి నిత్యం ఉదయం, సాయంత్రం నీళ్లు పోస్తారు. ఆ బుట్టలను బతుకమ్మలుగా భావించి నిత్యం ఆటపాటలతో పూజలు చేస్తారు. తొమ్మిదో రోజు మహిళలు మొలకెత్తిన ఆ బుట్టలను నెత్తిన పెట్టుకొని సంప్రాదాయ బద్ధంగా నృత్యాలు చేస్తూ ఆటపాటలతో చెరువులు కుంటలకు వెళ్లి బుట్టలను నిమజ్జనం చేస్తారు. తీజ్ సందర్భంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించిన బంజారాలు అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బొక్క సంగీతప్రభాకర్‌రెడ్డి, నాయకులు కొంతం అంజిరెడ్డి, మామిండ్ల ముత్యాలయాదవ్, మాజీ సర్పంచ్ వెంకటేష్, మాజీ ఉప సర్పంచ్ శోభారాణి, రాధాకృష్ణ, కె.కుమార్, బొక్క జంగారెడ్డి, జె.రమేష్, కె.నాగరాజు, నిర్వాహకులు రాములునాయక్, డీజీ.నాయక్, చరణ్‌దాస్, శంకర్, పురుషోత్తం, అధిక సంఖ్యలో బంజారా మహిళలు పాల్గొన్నారు.

ఉర్స్-ఎ-షరీఫ్ ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

తాండూరు, ఆగస్టు 11: తాండూరులోని సయ్యద్ అబ్దుల్ కరీం సాహెబ్ ఖిల్లా ఉర్స్-ఎ-షరీఫ్ 78వ ఉత్సవాల పోస్టర్‌ను మున్సిపల్ కౌన్సిలర్ నీరజాబాల్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ 17 నుంచి మూడురోజులు ఉత్సవాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు హబీబ్‌లాల, వలీ పాషా, సలీమ్ పాల్గొన్నారు.



ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే

మేడ్చల్ టౌన్, ఆగస్టు 11 : గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలో గల సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 11వ గ్రాడ్యుయేషన్ డేను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గ్లోబల్ హెడ్, ఎంటర్‌ప్రైజెస్ క్లౌడ్ అప్లికేషన్ వైస్‌ప్రెసిడెంట్ అమర్‌నాథ్ మాట్లాడుతూ విద్యార్థులు సమాజ శ్రేయస్సుకు పాటుపడాలన్నారు. ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని ముందుకుసాగాలన్నారు. కరస్పాండెంట్ శ్రీశైలంరెడ్డి, వైస్‌చైర్మన్ భూపాల్‌రెడ్డిలు మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలతో పాటు తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలన్నారు. ఉన్నత విద్యనభ్యసించి పేరుప్రతిష్ఠలు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో 949 మంది గ్రాడ్యుయేట్లు, 1,800మంది తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థులకు ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందజేశారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసులరెడ్డి, జంగారెడ్డి, నారాయణరెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు హాజరయ్యారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న కళాశాల కరస్పాండెంట్ శ్రీశైలంరెడ్డి



పట్టాలు అందుకున్న గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన విద్యార్థులు

పదోన్నతులను పూర్తి చేయాలి

కొడంగల్, ఆగస్టు 11: సర్వీస్ రూల్స్ అమలుతో ఎంఈవో పోస్టులు, పదోన్నతులను పూర్తి చేయాలని ఎస్టీయూ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ అన్నారు. హైదరాబాద్‌లోని కాచిగూడలో ఆదివారం జరిగిన ఎస్టీయూ రాష్ట్ర తృతీయ కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జీహెచ్‌ఎం, జేఎల్ పదోన్నతులకు అడ్డంకిగా ఉన్న జీవోలను అభయన్స్‌లో పునరుద్ధరించాలన్నారు. బీఎడ్ చేసిన ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ప్రమోషన్లలో నష్టం జరగడంతో సీనియారిటీ ప్రకారం జీవో 11, 12లను సవరించి పదోన్నతులు కల్పించాలన్నారు. సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యవర్గ సభ్యుడు పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వేణుగోపాల్

మధ్యాహ్న భోజన నిర్వహణను స్వచ్ఛంద సంస్థకు అప్పగించొద్దు

కొడంగల్, ఆగస్టు 11 : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థకు అప్పగించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైంది కాదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య అన్నారు. ఆయన కొడంగల్‌లో ఆదివారం మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద సంసకు అప్పగిస్తే కార్మికులు జీవనోపాధిని కోల్పోతారని దుస్థితి నెలకొంటుందన్నారు. ప్రభుత్వం భోజన కార్మికులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మి, వెంకటమ్మ, అంజమ్మ, జయమ్మ, రాములమ్మ, లావణ్య, సరళ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య

‘స్థానిక’ ఎన్నికలకు సమాయత్తం కావాలి

కడ్తాల్, ఆగస్టు 11: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కార్యోన్ముఖులు కావాలని ఏఐసీసీ కార్యదర్శి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి పిలుపునిచ్చారు. అవినీతి, అరాచక పాలనతో ప్రజావిశ్వాసాన్ని కోల్పోయి అధికారానికి దూరమైన బీఆర్ఎస్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ భూస్థాపితం కాక తప్పదని చెప్పారు. కడ్తాల మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాల అమలు స్థానిక సమస్యలను ప్రజలకు వివరించి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రతీ ఇంటికి అందేలా కార్యకర్తలు కృషిచేయాలన్నారు. అసెంబ్లీ, లోకసభ ఎన్నికల్లో పనిచేసిన విధంగానే స్థానిక ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు పాటుపడాలని అన్నారు. పార్టీ కోసం అంకితభావంతో పని చేయాలని ఆయన కోరారు. ప్రతీ కార్యకర్తకు స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం నామినేటెడ్ పదవుల భర్తీలో ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. ఎన్నికల అనంరతం బీజేపీ, బీఆర్ఎస్‌లకు రాష్ట్రంలో ఉనికే లేకుండ పోతుందని అన్నారు. ఆ పార్టీలను ప్రజలను నమ్మడం లేదన్నారు. రాహుల్ గాంధీ నేతృత్వంలో దేశంలో కాంగ్రెస్ బలీయమైన శక్తిగా ఎదిగిందని, ఇది ఎన్నికల్లోనూ నిరూపితమైందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను, వారి ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. నాలుగు రాష్ట్రాల్లో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అంతకు పార్టీ నాయకులు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, యాట నర్సింహ, అశోక్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబలు వంశీచంద్‌రెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, శ్రీకాంత్, విజయ్, పాండు, తులసీరాంనాయక్, బాలరాజు, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ నాయకులతో మాట్లాడుతున్న చల్లా వంశీచంద్‌రెడ్డి

ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ



దౌల్తాబాద్: బొడ్రాయి ప్రతిష్ఠాపన సందర్భంగా బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు



ఘట్‌కేసర్ రూరల్: అవుషాపూర్‌లో బోనాలతో వెళ్తున్న మహిళలు



మోమిన్‌పేట్: బోనాలు తీసుకెళ్తున్న గ్రామస్థులు

దౌల్తాబాద్, ఆగస్టు 11: ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. దౌల్తాబాద్ మండలంలోని చల్లాపూర్‌లో ఆదివారం బొడ్రాయి ప్రతిష్ఠాపనను వైభవంగా నిర్వహించారు. రెండు రోజులుగా కొనసాగుతున్న పూజాకార్యక్రమాల్లో భాగంగా ఆదివారం కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి హాజరై పూజలు నిర్వహించారు. మహిళలు పసుపు, గంధం, వేప పువ్వులు తదితర వాటితో బోనాలను అందంగా అలంకరించి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు విజయ్ కుమార్, కోట్ల మహిపాల్, నరోత్తంరెడ్డి, పకీరప్ప, శరణప్ప, మల్లేశం, వెంకట్రావ్, వెంకట్‌రెడ్డి, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మోర్లకు బోనం

ఘట్‌కేసర్ రూరల్: అవుషాపూర్, అంకుశాపూర్, మర్రిపల్లిగూడ, ఘనాపూర్, కాచవానిసింగారం, ఎదులాబాద్ తదితర గ్రామాల్లో బోనాల పండుగను నిర్వహించారు. బంగారు మైసమ్మ, మహంకాళి, పోచమ్మతల్లి తదితర ఆలయాలను సుందరంగా ముస్తాబుచేసి భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు అన్ని చర్యలు తీసుకున్నారు. సాయంత్రం సామూహికంగా ఊరేగింపుగా వెళ్లి బోనాలను గ్రామదేవతలకు సమర్పించారు. డప్పుచప్పుళ్లు, శివసత్తుల విన్యాసాల మధ్య బోనాలు ఉత్సాహంగా తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో అవుషాపూర్‌లో టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, బోడుప్పల్ కార్పొరేషన్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, నాయకులు కొండల్‌రెడ్డి, వామన్‌రెడ్డి, ఎల్సాని అయిలయ్యయాదవ్, సందీప్‌రెడ్డి, జంగయ్య, మాదవరెడ్డి, ఘనాపూర్‌లో కాంగ్రెస్ మేడ్చల్ బీ-బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: మండలంలోని కొత్త కొల్కుంద గ్రామంలో ఆదివారం భూలక్ష్మమ్మ దేవత బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా గ్రామ పురవీధుల మీదుగా ఆలయానికి చేరుకొని అమ్మవారికి ప్రత్యేక నైవేద్యాలతో మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగా పండాలని మొక్కుకున్నారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేకపూజలు



ఘట్‌కేసర్: హోమం నిర్వహిస్తున్న కౌన్సిలర్ దంపతులు

ఘట్‌కేసర్: పోచారంలోని మహంకాళి, ఈదమ్మ, పోచమ్మ అమ్మవార్ల ప్రథమ వార్షికోత్సవ పూజలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గత సంవత్సరం ఆలయాల నిర్మాణం పూర్తయిన సందర్భంగా ఆలయ ప్రారంభోత్సవంతో పాటు విగ్రహ ప్రతిష్ఠాపన కనుల పండువగా నిర్వహించిన విషయం తెలిసిందే. అప్పట్లో ఎమ్మెల్సీ కవిత ముఖ్యఅతిథిగా పాల్గొని అమ్మవారికి బంగారుబోనం సమర్పించారు. అప్పట్లో నూతన ఆలయంపై హెలికాప్టర్‌తో పూలు చల్లించారు. అప్పటి నుంచి నిత్యపూజలతో విరాజిల్లిన గ్రామదేవతల ఆలయాల వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక హోమంతోపాటు వివిధ రకాల పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం కౌన్సిలర్ ఆలయ నిర్మాణదారులు, కౌన్సిలర్ బద్దం మమతాజగన్ మోహన్‌రెడ్డి దంపతులతోపాటు, బాలయ్య, విష్ణుదంపతులు హోమం నిర్వహించారు, ఈహోమం క్రతువును పణింద్ర శర్మ, ప్రశాంత్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కదిరేశచారి, శ్రీకాంత్‌రెడ్డి, మహేష్‌గౌడ్, కృష్ణ, సురేష్‌గౌడ్ పాల్గొన్నారు.

కీసర రూరల్: నాగారం మున్సిపాలిటీ సత్యనారాయణ కాలనీలోని శ్రీరమాసత్యనారాయణస్వామి ఆలయ వార్షికోత్సవ పూజలు కనుల పండువగా జరిగాయి. చివరిరోజు ఆదివారం స్వామివారికి అభిషేకాలు, మండప పూజలు, మూలమంత్ర హోమం, పూర్ణాహుతి, తదితర పూజలు నిర్వహించారు. అనంతరం కీసరలోని సాయిధామ పీఠాధిపతి రామానందప్రభూజీ ప్రవచనాలు చేశారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, వైస్‌చైర్మన్ మల్లేష్‌యాదవ్ స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయచైర్మన్ అన్నంరాజ్ శ్రీనివాస్, అధ్యక్షుడు హరగోపాల్, ప్రధాన కార్యదర్శి నిరంజన్‌బాబు, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, వైవీవీ రంగారావు, వాడపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



స్వామి వారిని దర్శించుకుంటున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి



కీసర రూరల్: పూర్ణాహుతి నిర్వహిస్తున్న రామానందప్రభూజీ, తదితరులు

విశ్వహిందూ పరిషత్ అనంతగిరి జిల్లా నూతన కమిటీ



అనంతగిరి జిల్లా విశ్వహిందూపరిషత్ నూతన కమిటీ

వికారాబాద్, ఆగస్టు 11: కామారెడ్డిలో శని, ఆదివారం నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర విశ్వ హిందూ పరిషత్ ప్రాంత సమావేశాల్లో రాష్ట్రవ్యాప్తంగా అనేక జిల్లాల్లో మార్పులు చేర్పులు చేశారు. ఈ సమావేశాల్లో అనంతగిరి జిల్లాకు సంబంధించిన కీలక నియామకాలను ప్రకటించారు. ఈ సందర్భంగా జిల్లా మాతృశక్తి సంయోజికగా మ్యాడం లక్ష్మి నియమితులయ్యారు. అదేవిధంగా జిల్లా దుర్గావాహిని సంయోజికగా జి.శ్రీదేవి, జిల్లా ఉపాధ్యక్షులుగా దోమ శ్రీకాంత్, స్వప్నప్రియారెడ్డి నియమితులయ్యారు. జిల్లా సామాజిక సమరసత ప్రముఖ్‌గా వడ్ల శ్రీశైలంను నియమించారు. దుర్గావాహిని సహసంయోజికలుగా కట్ట మాధురి, కుమారి బర్మావత్ జమునని నియమించారు.

నవాబుపేట ఎస్ఐగా అరుణ్‌కుమార్‌గౌడ్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ అరుణ్‌కుమార్ గౌడ్

నవాబుపేట, ఆగస్టు 11: నవాబుపేట నూతన ఎస్ఐగా అరుణ్‌కుమార్‌గౌడ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు తనవంతుగా కృషి చేస్తానని తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలపాలకు ఎవరైనా పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువకుడికి సన్మానం



ఎండీ.సమీయొద్దీన్‌ను సన్మానిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి

మోమిన్‌పేట్, ఆగస్టు 11: మండలంలోని టేకులపల్లి గ్రామానికి చెందిన ఎండీ.సమీయొద్దీన్ ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆదివారం మోమిన్‌పేట్ సొసైటీ చైర్మన్ బి.విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి సమీయొద్దీన్‌ను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టేకులపల్లి గ్రామస్థులు, నాయకులు మోహన్‌రెడ్డి, మాణిక్యం, నాగిరెడ్డి, రాజేశ్, కరీంమొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కులకచర్ల, ఆగస్టు 11: మండలంలోని ఇప్పాయిపల్లి గ్రామానికి చెందిన రేణిపెద్ద ఆంజనేయులు ఆదివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఉపాధిహామీ గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింహులుగౌడ్ బాధిత కుటుంబానికి తనవంతుగా రూ.3వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు భాస్కర్, వడ్డె చిన్న వెంకటయ్య, ఆంజనేయులు, రాములు, బాలకృష్ణ, లక్ష్మయ్య, మొగులయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పేరుతో పేదల భూములు తీసుకోవద్దు



రైతులకు మద్దతుగా మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

బొంరాస్‌పేట్, ఆగస్టు 11: ప్రభుత్వం అభివృద్ధి పేరుతో కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల్‌లో రైతులు, పేదల భూములు తీసుకోవద్దని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం దుద్యాల్ మండల కేంద్రంలో రైతులు నిర్వహించిన ధర్నాకు ఆయన మద్దతు తెలిపారు. అభివృద్ధి చేయాలనుకుంటే రైతులు, పేదల భూములు తీసుకోకుండా కంపెనీలు ఏర్పాటు చేయాలన్నారు. బలవంతంగా భూసేకరణ చేస్తే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. నియోజకవర్గంలో 1154 ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూమి అన్యాక్రాంతం అయిందని ఆరోపించారు. అధికారులు ఆ భూముల జోలికి వెళ్లకుండా పేదల భూముల జోలికి రావడం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శాసం రామకృష్ణ, ఎరన్‌పల్లి శ్రీనివాస్, కోట్ల యాదగిరి, భీములు, మధు సూదన్‌యాదవ్, మడిగె శ్రీనివాస్, నరేశ్ గౌడ్, మల్లేశ్, నర్సింహులు, బసప్ప, మణికంఠగౌడ్, నారాయణ, వెంకటయ్య, శివ కుమార్, గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలకు నిధులు మంజూరయ్యేనా?

● పనులు చేయించి అప్పులపాలైన కార్యదర్శులు ● బదిలీలతో ఖర్చుచేసిన డబ్బులపై ఆందోళన



చెరువు ముందలి తండా (కే) పంచాయతీ భవనం

కులకచర్ల, ఆగస్టు 11: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీలకు నిధులు మంజూరు చేయకపోవడంతో ప్రత్యేకపాలన మొక్కుబడిగా సాగుతోంది. నిధుల కొరతతో ఒక్కో కార్యదర్శి రూ.లక్షల్లో అప్పులుచేసి గ్రామాల అభివృద్ధికి ఖర్చు పెట్టారు. పంచాయతీ కార్యదర్శుల బదిలీలు జరుగుతుండటంతో తాము ఖర్చుచేసిన డబ్బును ఎలా రాబట్టుకోవాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. గ్రామాల్లో సర్పంచుల పాలన ముగియడంతో ప్రత్యేక అధికారులకు పరిపాలన బాధ్యతలను అప్పగించారు. ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు క్షేత్ర స్థాయిలో పంచాయతీ పాలనను నిర్వహిస్తున్నారు. అయితే అధికారుల పాలనకు ముందు పంచాయతీ ఖాతాలన్నీ ఖాళీ అయ్యాయి. ఉమ్మడి కులకచర్ల మండలంలో 44 గ్రామ పంచాయతీలు ఉండగా ఫిబ్రవరి 2 నుంచి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. పంచాయతీల కనీస అవసరాలను తీర్చే బాధ్యత కార్యదర్శులపై పడింది.

కార్యదర్శులు అప్పుల పాలు

గ్రామ పంచాయతీల్లో ట్రాక్టర్ల కిస్తీల చెల్లింపు, నిర్వహణ ఖర్చులు, కార్మికుల వేతనాల చెల్లింపు, తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వాహణ తదితర పనులకు నిధులు లేక పంచాయతీ కార్యదర్శులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని గ్రామ పంచాయతీల్లో ఆరు నెలల నుంచి పారిశుధ్య కార్మికులకు వేతనాలను చెల్లించలేని పరిస్థితి నెలకొంది. నిధుల సమస్యను ప్రత్యేక అధికారుల దృష్టికి తీసుకెళ్తే తమకేమీ తెలియదని, నిధులు ఎలా సమకూర్చుకోవాలో మీకే తెలుసంటూ తప్పించుకుంటున్నారని కార్యదర్శులు వాపోతున్నారు. ఒక్కో పంచాయతీలో కార్యదర్శులు రూ.50వేల నుంచి రూ.2లక్షల వరకు అప్పుచేసి గ్రామాల్లో ఖర్చుచేసినట్లు తెలుస్తోంది. కార్యదర్శుల బదిలీలతో తాము ఖర్చు చేసిన డబ్బులను ఎలా రాబట్టుకోవాలో తెలియక వారు ఆందోళన చెందుతున్నారు.

పంచాయతీ మూడు ఖాతాలు ఖాళీ

పంచాయతీల్లో మూడు రకాల ఖాతాలు ఉన్నాయి. ఒకటి ఆస్తి పన్నులు, జమ చేసేందుకు ఉపయోగించే ఖాతా. గ్రామాల్లో ఆస్తి పన్ను వసూళ్లు జరుగుతున్నా ఖర్చు నాలుగింతలు ఉండటంతో ఈ ఖాతా ఎప్పుడు ఖాళీగానే ఉంటుంది. రెండో ఖాతా ఎస్ఎఫ్‌సీలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసే నిధులు. ఇందులో గ్రాంట్లను జమ చేస్తారు. రెండేళ్ల నుంచి రాష్ట్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేయడంలేదు. ఈ రెండు ఖాతాల్లో జమయ్యే నిధులను ట్రెజరీ ద్వారా పంచాయతీలు డ్రా చేసుకుంటాయి. మూడో ఖాతా 15వ ఆర్థిక సంఘం నిధులను ఖర్చుచేసేందుకు ఉపయోగిస్తారు. కేంద్ర ప్రభుత్వం నేరుగా ఈ ఖాతాల్లోకి ప్రతీ రెండు నెలలకోసారి నిధులను మంజూరు చేస్తుంది. కేంద్ర నిబంధనల ప్రకారం ఈ నిధులను ఖర్చు చేయాల్సి ఉంటుంది. కానీ నాలుగు నెలల నుంచి నిధులు మంజూరు కాలేదు.

ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలి

బషీరాబాద్, ఆగస్టు 11: ప్రధాన మంత్రి మోడీ తలపెట్టిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలని జిల్లా బీజేపీ నాయకులు, బషీరాబాద్ మండల మాజీ అధ్యక్షుడు రాజ్‌కుమార్ కులకర్ణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13 నుంచి 15తేదీ వరకు ప్రతీ ఒక్కరు జాతీయ జెండాను ఇంటిపై ఎగురవేయాలని సూచించారు. ఈ మేరకు సన్నాహక సమావేశాలు కూడా నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు.

తాండూరు: బీజేపీ తలపెట్టిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఆదివారం తాండూరు పట్టణం బూత్ నెంబర్-151 నాగారం కంపౌండ్‌లో బూత్ అధ్యక్షుడు సంగమేశ్వర్ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగుర వేశారు. జాతీయ ఐక్యత, జాతీయ సమగ్రత 'నేషన్ ఫస్ట్' అనే ప్రధాని మోదీ పిలుపు మేరకు తాండూరు పట్టణ అధ్యక్షులు నాగారం మల్లేశం తన ఇంటి నుంచే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ కోశాధికారి ప్రహ్లాద్ జాదవ్, కొడూరు సంతోష్‌కుమార్, గౌడంపల్లి శేఖర్, ప్రభు, రవేస్‌లతో పాటు బాల బాలికలు తదితరులు పాల్గొన్నారు.



తాండూరులో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో చిన్నారులు, బీజేపీ నేతలు

సిటిజన్ వెల్ఫేర్ నూతన కమిటీ ఎన్నిక

మేడ్చల్ టౌన్, ఆగస్టు 11: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని సత్యానగర్ కాలనీ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీని ఆదివారం కాలనీవాసులు ఎన్నుకున్నారు. కాలనీ నూతన అధ్యక్షుడిగా ఎస్.హరిని మూడోసారి కాలనీ వాసులు ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా మోసే దయాన్, కార్యదర్శులుగా రాజా, రఫీఉద్దీన్ అహ్మద్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.



సత్యనగర్ కాలనీ సిటిజన్ వేల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

టీపీసీసీ అధికార ప్రతినిధికి సన్మానం



హర్షవర్ధన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న చంద్రయ్య

పరిగి, ఆగస్టు 11: పరిగి మండల మాజీ జడ్పీటీసీ చంద్రయ్య ఆదివారం మహబూబ్‌నగర్‌లో పీఆర్టీయూ తెలంగాణ వ్యవస్థాపకుడు, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్‌రెడ్డిని చంద్రయ్య పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పరిగి, ఆగస్టు 11: బైక్ అదుపుతప్పి ఓవ్యక్తిని ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న వ్యక్తి తీవ్ర గాయాలపాలై మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని నస్కల్ గ్రామంలో ఆదివారం జరిగింది. ధరూర్ మండలం మైలారం గ్రామానికి చెందిన బాల్‌రాజ్(35) పరిగి నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో నస్కల్ గ్రామంలో రోడ్డుపై ఉన్న ముస్తఫా అనే వ్యక్తిని ఢీకొన్నాడు. దీంతో బైక్ అదుపుతప్పి బాల్‌రాజ్ తలకు తీవ్రగాయమైంది. దీంతో అతడి అక్కడికక్కడే మృతిచెందాడు. ముస్తఫాకు స్వల్పగాయాలయ్యాయి. మృతుడి కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. బాల్‌రాజ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పరిగి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బదిలీపై వెళ్లిన వెటర్నరీ డాక్టర్‌కు ఘన సన్మానం



వెటర్నరీ డాక్టర్ నిజానంద్ దంపతులను సన్మానిస్తున్న మాజీ సర్పంచ్ విజయలక్ష్మీపండరి

తాండూరు రూరల్, ఆగస్టు 11: మండలంలోని మల్కాపూర్‌లో బదిలీపై వెళ్లిన వెటర్నరీ డాక్టర్ నిజానంద్‌ను మాజీ సర్పంచ్ విజయలక్ష్మీపండరి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గ్రామంలో ఆదివారం ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసి డాక్టర్ నిజానంద్‌ను సన్మానించి ఘనంగా వీడ్కోలు పలికారు. 11ఏళ్లపాటు ఆయన చేసిన సేవలను మాజీ సర్పంచ్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రవిసింధే, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాధవరెడ్డి, మాజీ సర్పంచులు కురువ నాగార్జున, సాయిలు, మిట్టబాస్పల్లి జగదీష్, మాజీ ఉప సర్పంచ్ కాశీనాథ్, పండరి, మైనుద్దీన్, బందెప్ప, మోహన్‌గౌడ్, చింతకుంట వెంకటేష్, గైబప్ప, నాగారం లక్ష్మీనారాయణ, భీమయ్య, చిన్న కాశప్ప, శివకుమార్, ఉల్లి నర్సింహులు, రాజారాం, శేఖర్, కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య, నాయకులు, ప్రజా ప్రతినిధులు, రైతులు డాక్టర్ నిజానంద్‌ను ఘనంగా సన్మానించారు.


13న చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న మల్లికార్జున్

కులకచర్ల, ఆగస్టు 11: ఈనెల 13న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ తెలిపారు. కులకచర్ల, దోమ మండలాల ఎమ్మార్పీఎస్ నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈనెల 13న చలో హైదరాబాద్ ఎమ్మార్పీఎస్ విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేసేందుకు ఎమ్మార్పీఎస్ నాయకులు భారీగా తరలిరావాలని కోరారు. 30 సంవత్సరాల దండోరా పోరాటం ఫలించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ప్రధాన కార్యదర్శి కొమ్ము శ్రీనివాస్, ఎల్లయ్య, వెంకటయ్య, బిచ్చన్న, రవికుమార్, దోమ మండల నాయకులు బి.వెంకటేశ్, శ్రీకాంత్, సాయికుమార్, ప్రశాంత్ పాల్గొన్నారు.

జిల్లా భూసదస్సును విజయవంతం చేయాలి



జిల్లా భూ సదస్సు కరపత్రాలు విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

పరిగి, ఆగస్టు 11: ఈనెల 13న కొడంగల్ పట్టణంలోని రెడ్డి బసిరెడ్డి గార్డెన్‌లో నిర్వహించే జిల్లా భూసదస్సును జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటయ్య పిలుపునిచ్చారు. పరిగిలో సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా సదస్సు కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిగి మండలంలోని రంగాపూర్ గ్రామంలోని సర్వే నెం18లో 9 ఎకరాల 39 గుంటల ప్రభుత్వ భూమిని పేదల ఇళ్ల స్థలాలకు ఇవ్వాలని, నారాయణపూర్ గ్రామ రెవెన్యూ పరిధిలో అన్యాక్రాంతమైన 32 ఎకరాల భూమిని వెంటనే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్నారు. ధరణి పోర్టల్‌తో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు, పేదల భూసమస్యలను పరిష్కరించాలని ఈ నెల 13న కొడంగల్‌లో నిర్వహించే జిల్లా సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్తయ్య, రఘురామ్, శేఖర్, కృష్ణ, రాంచంద్రయ్య, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు ఘన సన్మానం



మార్కెట్ కమిటీ డైరెక్టర్‌ను సన్మానిస్తున్న తిమ్మాయిపల్లి గ్రామస్థులు

యాలాల, ఆగస్టు 11: గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తాండూరు ఏఎంసీ డైరెక్టర్ రాజు అన్నారు. తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకులు ఆదివారం రాజును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. మార్కెట్ కమిటీ నిధులతో గ్రామాన్ని అభివృద్ధి పరిచేందుకు కృషిచేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో అమర్నాథ్‌రెడ్డి, రాజు, శ్రీనివాస్, జగదీష్, శేఖర్, రాములు పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధి పొందాలి

ఘట్‌కేసర్, ఆగస్టు11: యువత స్వయం ఉపాధి పొంది రాణించాలని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ఎఫ్‌సీనగర్ చౌరస్తాలో ఆదివారం సురేందర్, శ్రీకాంత్‌లు ప్రారంభించిన చాయ్‌రెస్టో టీస్టాల్‌ను ఆయన ప్రాంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ప్రభుత్వ ఉద్యోగాలు రాలేదని నిరాశ చెందకుండా స్వయం ఉపాధి రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలన్నారు. వ్యాపారాలు సాగిస్తూనే ఉద్యోగాల కోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బొక్క సంగీతాప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మేడబోయిన వెంకటేష్, కందుల కుమార్, కొంతం అంజిరెడ్డి, బర్ల రాధాకృష్ణ, బొక్క జంగారెడ్డి, బొక్క సుధాకర్‌రెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

నేడు వికారాబాద్ బంద్

వికారాబాద్ , ఆగస్టు 11: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా సోమవారం వికారాబాద్ బంద్‌కు హిందూ ఐక్యవేదిక పిలుపు నిచ్చింది. వికారాబాద్ పట్టణంలోని రామమందిరంలో ఆదివారం హిందూ బంధువులందరి సమక్షంలో నిర్వహించిన సమావేశంలో హిందూ ఐక్యవేదిక బంద్ పాటించాల్సిందిగా కోరింది. పట్టణంలోని అన్ని వ్యాపార సముదాయాలను సోమవారం స్వచ్ఛందంగా మూసివేయాలని బంద్‌లో హిందువులందరూ తరలివచ్చి బంగ్లాదేశ్‌లో జరుగుతున్న దాడులను ఖండించాలని పిలుపునిచ్చారు.

నూతన గృహ ప్రవేశానికి హాజరైన తిరుపతిరెడ్డి



నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో తిరుపతిరెడ్డి

దుద్యాల మండలంలోని హకీంపేట్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు హకీంపేట సంజీవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్టు నర్సింహారెడ్డి నూతన గృహప్రవేశానికి ఆదివారం కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనను పార్టీ నాయకులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆవుటి శేఖర్, నర్సింహులుగౌడ్, వెంకట్రాములుగౌడ్, మెరుగు వెంకటయ్య, నర్సింహులునాయుడు, పోలెపల్లి నర్సింహ, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

- బొంరాస్‌పేట్, ఆగస్టు 11